క్లుప్తంగా

లోక్‌అదాలత్‌లో 510 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి సౌజన్య

భీమునిపట్నం: భీమిలిలో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 510 కేసులు పరిష్కారమయ్యాయి. ఇక్కడి ఒకటో అదనపు సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి డి.సౌజన్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రెండో అదనపు సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు కూడా ఆమె ఇన్‌చార్జి జడ్జిగా ఉన్నారు. ఈ మూడు కోర్టులకు సంబంధించి 510 కేసులు పరిష్కారమయ్యాయి. అదాలత్‌లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధుల్లోని కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎ.వి.పార్వతీశం, పోలీసులు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌లో సందర్శకుల రద్దీ



బీచ్‌లో భారీగా ఉన్న సందర్శకులు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌కు శనివారం సందర్శకులు పెద్ద ఎత్తున వచ్చారు. సాధారణంగా కార్తీక మాసం పిక్‌నిక్ సీజన్‌లో పలు ప్రాంతాల నుంచి చాలామంది వస్తుంటారు. అయితే, కార్తీక మాసం పూర్తయి పది రోజులపైనే కావస్తున్నా వీరి సంఖ్య ఏమాత్రం తగ్గలేదు. రెండో శనివారం, సెలవుదినం కావడంతో ఉదయం ఎనిమిది గంటల నుంచే సందర్శకుల రాక మొదలైంది. పది గంటల తరువాత భారీగా చేరుకున్నారు. వీరు వచ్చిన వాహనాలతో తీరం నిండిపోయింది. సముద్రం వెనక్కి వెళ్లడంతో పాటు, అలల ఉధృతి తక్కువగా ఉండటంతో అందరూ నీటి వద్ద, ఇసుకలో సరదాగా గడిపారు. తీరంలో తినుబండారాలను విక్రయించే షాపుల వారికి మంచి వ్యాపారం జరిగింది.

గీతంలో ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ



అవగాహన కల్పిస్తున్న డా.రాజేష్

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మూర్తి ప్రయోగశాలలో అధునాతన ఎన్ఎంఆర్ పరికరాలపై అధ్యాపకులకు, స్థానిక పరిశ్రమల నిపుణులకు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ (ఎఫ్.డి.పి) శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిపుణుడు డా.రాజేష్ మాట్లాడుతూ న్యూక్లియర్ మాగ్నెటిక్ రెజొనెన్స్ అప్లికేషన్‌ను మెడికల్ డయాగ్నసిస్‌లో ఉపయోగిస్తారని తెలిపారు. అత్యంత ఖరీదైన ఈ పరికరం ఆధారంగా ఔషధ పరిశోధనలు, బయోమెడికల్ రంగంలో పరిశోధనలు ఏ విధంగా చేయవచ్చో అవగాహన కల్పించారు.

నరసింహస్వామిపై ఆంగ్ల శతకం ఆవిష్కరణ



ఆంగ్ల శతకాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకులు శింగరాచార్యులు

భీమునిపట్నం: నరసింహస్వామి వారిపై రచించిన ఆంగ్ల శతకం ఆవిష్కరణ ఆదివారం భీమిలిలో జరిగింది. డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ రచించిన ఈ పుస్తకాన్ని ఇక్కడి జగన్నాథ స్వామి ఆలయం వద్ద సౌమ్యగిరి నరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల శింగరాచార్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి గురించి ఆంగ్లంలో శతకాన్ని రచించడం గొప్ప విషయమన్నారు. దీన్ని రచించిన కృష్ణవీర్ అభిషేక్ అభినందనీయులని అన్నారు.

స్మృతిగానే స్టూడియోలు..!



స్మార్ట్ ఫోన్ల రాకతో తగ్గుతున్న ఫొటో స్టూడియోలు • అద్దెల చెల్లింపూ భారం • ఫొటోగ్రాఫర్ల అవస్థలు

ఫొటో .. మరపురాని మధుర **జ్ఞాపకం.** ఏళ్ల నాటి సంఘటనలనూ **కనుల ముందు** సాక్షాత్కరింపజేసే స్మృతుల **పరిమళం.** అయితే, గత జ్ఞాపకాలను **పదిలంగా** పొందుపరిచి, మనకు అందించే **ఫొటో** స్టూడియోలు కూడా ఇప్పుడు **జ్ఞాపకం** గానే మిగిలిపోయే పరిస్థితి **కనిపిస్తోంది.** ప్రతి ఒక్కరి చేతిలో వెలిసిన **స్మార్ట్ ఫోన్లు** ఫొటో గ్రాఫర్లను వెనక్కి **నెట్టేశాయి.** ఫలితంగా కొన్ని ఫొటో **స్టూడియోలు** మూత పడుతున్నాయి.. **మరికొన్ని** ప్రత్యామ్నాయం వైపు **చూస్తున్నాయి.**

తగరపువలస: ఫొటోగ్రాఫర్లకు **ఉపాధి గండం** ఏర్పడింది. ఫొటోలంటే **అప్పుడూ ఇప్పుడూ** ఆసక్తి అలానే ఉన్నా.. స్మార్ట్ ఫోన్ల **రాకతో ప్రత్యేకం**గా స్టూడియోకు వెళ్లి తీయిం**చుకునే అవసరం** లేకుండా పోయింది. గతంలో **ప్రతీ సందర్భాన్ని** పదిలంగా భద్రపరుచుకునేందు**కు ప్రతి ఒక్కరూ** ఫొటో స్టూడియోకు వెళ్లి ఫొ**టో తీయించుకునే**వారు. దీంతో అప్పట్లో ఫొటో స్టూడియోలు కళకళలాడేవి. ఫొటోగ్రాఫర్లకు చేతినిండా పని దొరికేది. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ల దెబ్బతో ఫొటోగ్రాఫర్లకు పని లేకుండా పోయింది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో మార్కెట్‌లోకి వస్తున్న స్మార్ట్‌ఫోన్లు సాధారణ ప్రజానీకం చేతిలో కూడా ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో చిన్న కార్యక్రమాలకు ఫొటోగ్రాఫర్లను పిలవడం మానేశారు. వివాహాది శుభకార్యాలకు మాత్రమే ఆహ్వానిస్తున్నారు. ఫలితంగా పెళ్లిళ్ల సీజన్‌లో తప్ప మిగిలిన సమయంలో ఫొటోగ్రాఫర్లు ఖాళీగా ఉంటున్నారు. క్రమేణా ఉపాధి తగ్గిపోవడంతో భీమిలి నియోజకవర్గంలో ఫొటోగ్రాఫర్ల సంఖ్య కూడా తగ్గిపోతోంది.

పాస్‌పోర్ట్ ఫొటోలకూ ప్రత్యామ్నాయం

గతంలో ఫొటోగ్రాఫర్లు సరైన పని లేని సమయంలో కనీసం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోల ద్వారా అయినా ఉపాధి పొందేవారు. ప్రస్తుతం ఆ పనీ లభించడం లేదు. ఎవరికివారు తమ స్మార్ట్ ఫోన్లతో ఫొటోలు తీసుకుని అందుబాటులో ఉన్న ల్యాబ్‌లకు వెళ్లి ప్రింట్లు తీయించుకుంటున్నారు. మరికొందరు జిరాక్స్ సెంటర్లు, మీసేవా కేంద్రాలలో కూడా పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీస్తుండటంతో వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్లు ఉసూరుమంటున్నారు.



ప్రముఖుల ఫొటోలతో ఫొటో స్టూడియో

వందకు పైగా స్టూడియోలు

భీమిలి నియోజకవర్గంలో చిన్నాపెద్ద ఫొటో స్టూడియోలు వందకు పైగా ఉన్నాయి. ఇవి కాకుండా ఫొటోస్టూడియోలు లేకుండా ఫొటోగ్రఫీపై ఆధారపడి మరో 200 మంది ఉన్నారు. స్టూడియోలు, ఇక్కడి ఫొటోగ్రాఫర్ల వద్ద చేసేవారు, నగరంలో స్టూడియోలు, ల్యాబ్‌లలో పనిచేస్తున్న వారు వెయ్యి మందికి పైగా ఉన్నారు. భీమిలి నుంచి విశాఖ నగర తీర ప్రాంతం వరకు వేలాది మంది ఫొటోగ్రాఫర్లు జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఉన్నత విద్యావంతులే కాకుండా సరైన ఉద్యోగావకాశాలు లేక ఈ రంగంలోకి వచ్చిన వారు కూడా ఉండటంతో పోటీ పెరిగింది. అయితే, ప్రస్తుతం సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో స్టూడియోల అద్దెలు, విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు.

పెట్టుబడి భారం

పోటీ కారణంగా క్వాలిటీ కోసం విలువైన, అధునాతన కెమెరాలను వినియోగదారులు కోరుతుండటంతో ఫొటోగ్రాఫర్లకు పెట్టుబడులు పెట్టడం కష్టంగా మారింది. దీంతో చాలామంది ఫొటోగ్రాఫర్లు ఇబ్బంది పడుతున్నారు. మిగిలిన కాలంలో ఎలా ఉన్నా పెళ్లిళ్ల సీజన్‌లో మాత్రం ఫొటోగ్రాఫర్ల పరిస్థితి కాస్త మెరుగే. పోటీ కారణంగా డిమాండ్ ఉన్నా తక్కువ ధరలకే పని చేయవలసి వస్తోంది. ఈ సీజన్‌లో సొంతంగా లేదా టేకింగ్‌కు వెళ్లి రోజుకు రూ.2 నుంచి 5వేలు సంపాదిస్తున్నారు. మరికొందరు ప్రత్యామ్నాయంగా స్టూడియోలలో గిఫ్ట్ ఆర్టికల్స్, ఫొటోఫ్రేమ్‌లు విక్రయిస్తున్నారు.

మా పని ఇతరులూ చేస్తున్నారు



మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతోంది. ఫొటోగ్రాఫర్ల పనిని ఇతరులు చేస్తుండటంతో మా ఉపాధికి గండి పడుతుంది. మీ సేవా కేంద్రాలు, కలర్ జిరాక్స్ సెంటర్లలో ప్రింటింగ్ బాక్సుల ద్వారా పాస్‌పోర్టు సైజ్ ఫొటోల ప్రింట్లు తీస్తున్నారు. ఇక మాకు ఉపాధి ఎలా ఉంటుంది? నైపుణ్యం ఉన్నా ఇంతే..
– రాపర్తి జీవన్‌ప్రకాష్, తగరపువలస






ఫొటో స్టూడియోల్లో ప్రత్యామ్నాయంగా గిఫ్ట్ ఆర్టికల్స్, ఫొటో ఫ్రేముల విక్రయాలు

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



చాలా ఏళ్లుగా ఈ వృత్తిలో ఉండి గతంలో ఒక వెలుగు వెలిగిన వారి స్టూడియోలు ఇప్పుడు వెలవెల పోతున్నాయి. వెనకబడిన ఫొటోగ్రాఫర్లను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారిని ఆదుకోవాలి. స్టూడియోల భవిష్యత్తు బాగా లేక చాలామంది ప్రత్యామ్నాయ పనులు చేసుకుంటున్నారు.
– కోల శివకుమార్, సంగివలస

నైపుణ్యం ఉన్నా ఇళ్లకే పరిమితం



కొన్ని స్టూడియోలలో నైపుణ్యం లేని వారు కూడా కెమెరాలు పట్టుకుని మార్కెట్‌లోకి వస్తున్నారు. వాళ్లు తక్కువ ధరలకు వచ్చీరాని విధంగా పని చేస్తున్నారు. దీంతో స్కిల్డ్ ఫొటోగ్రాఫర్లకు పని లేకుండా పోతుంది. దీంతో నైపుణ్యం ఉండీ చాలా మంది ఖర్చులు భరించలేక ఇళ్లకే పరిమితం అవుతున్నారు.
–విజ్జపు సంతోష్, తాళ్లవలస

స్మార్ట్‌ఫోన్లతో ఉపాధి తగ్గింది



స్మార్ట్‌ఫోన్ల రాకతో సీనియర్ ఫొటోగ్రాఫర్లకు ఉపాధి తగ్గింది. ప్రస్తుతం చిన్న కార్య క్రమాలకు ఫొటో గ్రాఫర్లను పిలవడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అద్దెలు, విద్యుత్ బిల్లులకు కూడా కష్టంగా ఉంటుంది.
–కుంచం వెంకటరమణ, చిట్టివలస

నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణమా?

- మహిళల ఆగ్రహం
- ఐద్వా ఆధ్వర్యంలో నిరసన



శివశక్తినగర్ రోడ్డులో అయ్యప్పనగర్ వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

మధురవాడ: నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే సహించబోమంటూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్వయంకృషినగర్, అయ్యప్పనగర్ పరిసర ప్రాంతాల మహిళలు నిరసన చేపట్టారు. జీవీఎంసీ 5వ వార్డు పరిధి శివశక్తినగర్ రోడ్డులోని అయ్యప్పనగర్ వద్ద వైన్ షాపు, బార్ ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం తెలియడంతో వీరు శనివారం ఉదయం నుంచే 11గంటల వరకు ధర్నా చేపట్టారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వైన్ షాపు, బార్ వలన ఈ ప్రాంతంలో మహిళలు, పిల్లలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఐద్వా విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బి.భారతి, సీఐటీయూ నాయకురాలు డి.కొండమ్మ మాట్లాడుతూ నివాసాల మధ్య దుకాణాల ఏర్పాటు వల్ల తలెత్తే పరిణామాలు, ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా విచ్చలవిడిగా వైన్‌షాపులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా అనేక ప్రాంతాలలో నిరసనలు వెల్లువెత్తుతున్నా కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ వైన్ షాపు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, లేకుంటే మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వీరి ఆందోళనకు స్థానికులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం, కాలనీల పెద్దలు టీకే శారద, సంధ్య, నాగమణి, స్థానిక నాయకులు వెంకటరావు, ఎ.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం నిరసన



బైపాస్‌రోడ్డులో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: విద్యుత్ బిల్లుల పెంపుపై భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. బైపాస్‌రోడ్డులోని వైఎస్సార్ కూడలి వద్ద బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై కుట్రపూరితంగా రూ.8వేల కోట్లు ట్రూ అప్ చార్జీల పేరుతో నడ్డి విరిచిందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో మరింత భారాన్ని మోపే ప్రయత్నం చేస్తోందన్నారు. వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.నాగరాణి, పంపాన సూర్యనారాయణ, నీలాతి రాము, పల్లా రమణ, పల్లా పెంటరాజు, జీరు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన అల్లూరి మ్యూజియం

- శిల్పారామం మ్యూజియంలో కానరాని చారిత్రక ఘట్టాలు
- అల్లూరి చేతిలో విల్లు, ఆంగ్లేయుల చేతిలో ఆయుధాలు మాయం
- పట్టించుకోని అధికారులు



మాయమైన గిరిజనుని చేతిలో గడ్డపార, ఆంగ్లేయుని చేతిలో కొరడా



కళావిహీనంగా అల్లూరి మ్యూజియం

పీఎం పాలెం: శిల్పారామంలో అల్లూరి సీతారామరాజు మ్యూజియం కళావిహీనంగా దర్శనమిస్తోంది. అల్లూరి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఇక్కడ మ్యూజియం నెలకొల్పారు. అల్లూరి సీతారామరాజు తపస్సు చేసుకున్న సంఘటన మొదలుకుని ఆయనను ఆంగ్లేయ అధికారి చెట్టుకు కట్టి తుపాకీతో కాల్చి చంపే ఘట్టం వరకు అనేక అంశాలపై శిల్పాలు ఏర్పాటు చేశారు. గిరిజనులపై ఆంగ్లేయ అధికారుల అమానుషాలను, దౌర్జన్యాలను కళ్లకు కట్టినట్లు చూపే విధంగా మ్యూజియం అంతర్భాగాన్ని 14 భాగాలుగా విభజించి, సన్నివేశాలకు సంబంధించిన శిల్పాలను ఏర్పాటు చేశారు. అయితే నిర్వహణ లోపం కారణంగా మ్యూజియంలో చిత్రాలు మసకబారాయి. సన్నివేశాలకు అనుగుణంగా శిల్పాలకు అమర్చిన గునపాలు, తుపాకీలు, కొరడాల వంటి ఆయుధాలు మాయం అయ్యాయి. అల్లూరి జీవిత చరిత్రను వివరించే బోర్డు కూడా గల్లంతైంది. బొమ్మలు మాత్రం మిగిలాయి. దీంతో మ్యూజియం శిథిల బొమ్మల స్టోర్ రూమ్‌లా దర్శనం ఇస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి, మ్యూజియంను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



పోలికలు లేని అల్లూరి విగ్రహం

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పద్మనాభం హైస్కూల్లో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

పద్మనాభం: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఆకాంక్షించారు. మండలంలోని ఆర్‌వీ పురం, పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, పద్మనాభం కస్తూర్బా విద్యాలయాన్ని శనివారం సందర్శించి, పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఇప్పటి నుంచే విద్యార్థులు పరీక్షలకు బాగా సన్నద్ధం కావాలన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ఉపాధ్యాయులు పక్కాగా అమలు చేయాలన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. దీనిలో భాగంగా మండల విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించారు.


గొట్టిపల్లి హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లి జెడ్పీ హైస్కూల్‌ను డీఈవో ప్రేమ్‌కుమార్ శనివారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి అత్యధిక మార్కులు సాధించడానికి సూచనలు చేశారు. సోషల్ స్టడీస్‌లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

తీరంలో అనధికార నిర్మాణాలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తీర ప్రాంతానికి సమీపంలో సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి పలు చోట్ల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నగరపాలెం బ్రిడ్జి దిగువ భాగాన గెడ్డను ఆనుకుని ఓ వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగిస్తున్నారు. ఇదేవిధంగా తిమ్మాపురం, బీచ్‌రోడ్డుకు ఆనుకుని ఓ వ్యక్తి ఏకంగా భవనాన్ని నిర్మించేస్తున్నారు. ప్రధాన రహదారి వెంబడి నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తున్నా వీటి వైపు కన్నెత్తికూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని పలువురు నేతలు హెచ్చరిస్తున్నారు.

ముగిసిన విక్టోరియా వర్సిటీ అధ్యయన యాత్ర



కేథరిన్ విద్యాసంస్థలలో విక్టోరియా వర్సిటీ అధ్యాపక బృందం

తగరపువలస: భీమిలి కేథరిన్ విద్యాసంస్థలలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు చెందిన విక్టోరియా విశ్వవిద్యాలయ అధ్యాపక సిబ్బంది రెండు వారాల పర్యటన శనివారంతో ముగిసింది. వరుసగా 8వ ఏడాది 20 మందితో కూడిన బృందం ఈ అధ్యయన యాత్రలో పాల్గొంది. కేథరిన్ సిబ్బందితో కలిసి నూతన బోధన పోకడలు, తరగతి గదుల నిర్వహణ శైలి, మానసికంగా గాయపడిన విద్యార్థులను గుర్తించడం, వైవిధ్యమైన వాతావరణం కల్పించడం వంటి సూక్ష్మస్థాయి అవగాహన సదస్సులు నిర్వహించింది. పర్యటనలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ , ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్‌ను సందర్శించి అక్కడి అధ్యాపకులతో నాలెడ్జ్ షేర్ చేసుకున్నారు. వీసీ జి.శశిభూషణరావును కలుసుకున్నారు. అనంతరం కేథరిన్ విద్యాసంస్థల డైరెక్టర్ ఇవాంజలిన్ రాయికి విక్టోరియా విశ్వవిద్యాలయ గౌరవ ఆచార్యునిగా నియామక పత్రం అందించారు. ఆచార్య మార్షల్ ఆధ్వర్యంలో బృందం పర్యటించింది. కేథరిన్ విద్యాసంస్థల అధినేత ఆలీవర్ రాయి పాల్గొన్నారు.

అండగా ఉంటే అణగదొక్కారు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు సత్యం

- మాజీ మంత్రి ముత్తంశెట్టిపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆగ్రహం
- మంత్రిని చేసిన పార్టీని విమర్శించడంపై మండిపాటు

తగరపువలస: అండగా ఉంటారని 2019 ఎన్నికలలో చెమటోడ్చి ముత్తంశెట్టిని గెలిపిస్తే తమను అణగదొక్కేశారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీని వీడి పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను విమర్శించడంపై కార్యకర్తలు, నాయకులు విరుచుకుపడ్డారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలో శనివారం జరిగిన సమావేశంలో పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముత్తంశెట్టి వేరే పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టి, నిజమైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అణగదొక్కారని ఆవేదన చెందారు. వార్డులలో, పంచాయతీలలో నాయకులను విడదీసి, భయపెట్టి ఐదేళ్లు పబ్బం గడుపుకొన్నారని విమర్శించారు. ఒక మండల నాయకులు మరో మండల నాయకులతో మాట్లాడకుండా కట్టడి చేశారని మండిపడ్డారు. భీమిలి ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు సమాధానం చెప్పే ధైర్యం లేక నగరంలోని తన ఇంటికి కొద్దిమందిని పిలిపించుకున్నారన్నారు. భజన చేసేవాళ్లనే తన వెంట తిప్పుకొని మిగిలిన వారిని నట్టేట ముంచారన్నారు. మంత్రిని చేసిన పార్టీ అధినేతను విమర్శించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఊసరవెల్లి రాజకీయాలు

గంటా చేతిలో ఓటమి పాలైనా ఆయనతోనే తిరుగుతూ ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారని నాయకులు మండిపడ్డారు. ఇప్పుడు ఆయన పార్టీని వీడటంతో తామంతా స్వేచ్ఛగా ఉండగలుగుతున్నామన్నారు. భీమిలిలో నెలరోజుల ముందే పండగ వాతావరణం చోటు చేసుకుందన్నారు.

సమావేశంలో ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు జగన్నాథ సన్యాసిరెడ్డి, పాట్నూరు చంద్రశేఖర్, కోరాడ వెంకట రమణారావు, చందక సూరిబాబు, కోరాడ అప్పలస్వామి నాయుడు, ఎస్.చంద్రమౌళి, ముసలినాయుడు, బొట్ట రామకృష్ణ, సమ్మిడి శ్రీనివాసరావు, మజ్జి సూరినాయుడు, తుపాకుల అప్పలరాజు, బొడ్డు దుర్గారావు, శిరిగుడి ఈశ్వరరావు, దుంపల ప్రభాకర్, డబ్బీరు ప్రశాంతి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, అక్కరమాని అప్పలనాయుడు, రమణ, నమ్మి లక్ష్మణ, శీరపు నరసింహారెడ్డి, ఇల్లపు వెంకటరావు, కుంచా శివ రామకృష్ణ, చింతగుంట శివ, ఎరుసు అప్పలకొండ, సాడి రమణ, శిల్లా వంశీ, కొయ్య రమేష్, సిమ్మల ప్రసన్న, చిల్ల ప్రమీల, మద్ది మహాలక్ష్మి, చేట్ల అప్పలసూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ సోమరాజుకు నివాళులు



సోమరాజుకు నివాళులు అర్పిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

తగరపువలస: భీమిలి మున్సిపాల్టీ మాజీ కౌన్సిలర్ తూతిక సోమరాజుకు సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఎం, సీఐటీయూ నాయకులు నివాళులు అర్పించా రు. చిట్టివలసలోని ఆయన నివాసం వద్ద శనివారం నిర్వహించిన సంస్మరణ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ రెండుసార్లు కౌన్సిలర్‌గా పనిచేసి, ప్రజా సమస్యలపై పోరాడారన్నారు. సోమరాజుకు నివాళులు అర్పించిన వారిలో అల్లు బాబూరావు, కానూరి రాంబాబు, ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ, మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, నూలు ఆదినారాయణ, తెడ్లాపు గోపాలకృష్ణ ఉన్నారు.